

## ఆకట్టుకున్న బంగారమ్మ ముగ్గు

తొట్టంబేడు, జూన్ 4 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణ పొలిమేరల్లో వెలసిన బంగారమ్మ ఆలయంలో జాతర సందర్భంగా బుధవారం రాత్రి బంగారమ్మ దీపాల ముగ్గుభక్తుల్ని ఇట్టే ఆకట్టుకుంది. ఉదయం నుంచి ఆలయానికి నాయకుల తాకిడి పెరిగింది. దేవస్థానం నుంచి సారెను అందించారు. అమ్మవారి ఊరేగింపు తరువాత ఆలయంలో కన్నుల పండువగా ఇట్టే ఆకట్టుకునే రీతిలో బంగారమ్మ విగ్రహానికి దీపాలతో ముస్తాబు చేసారు. మహిళా భక్తులు విశేషసంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.




## చెరువులో దిగి వ్యక్తి మృతి



పెళ్లకూరు, జూన్ 4 ప్రభాతవార్త:
మండలంలోని దిరసనమాల గ్రామంలో మంగళవారం రాత్రి 7 గంటల సమయంలో దొడ్డగ శ్రీనివాసులు(55) భార్యతో కలిసి బర్రి దూడ కనిపించలేదని దానిని వెతికే క్రమంలో చెరువులోకి దిగిందని భార్య కళ్ళ ముందే చెరువులోకి దిగి కనిపించకుండా పోయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వెంటనే స్పందించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్ఐ నాగరాజు విఆర్ఓ రమేష్ అక్కడున్న గ్రామస్తులతో కలిసి చెరువులో వెతికించడం ప్రారంభించారు. బాగా రాత్రి సమయం కావడంతో ఎంత వెతికినా ఫలితం లేకుండా పోయింది. బుధవారం ఉదయం గ్రామస్తులు అందరూ వెతికే పనిలో ఉండగా దొడ్డగ శ్రీనివాసులు మృతదేహం ఉబ్బి పోయి పైకి తేలడంతో గ్రామస్తులు గుర్తించి పైకి చేర్చారు. చనిపోయిన శ్రీనివాసులుకు ఇద్దరు పిల్లలు కుమార్తె భవాని(22) కుమారుడు సాయి (24)ఉన్నారు. శ్రీనివాసులు పార్థివ దేహానికి సూళ్లూరుపేట నియోజకవర్గం ఇంచార్జ్ నెలవల సుబ్రహ్మణ్య, అక్కరపాక మాధవ రెడ్డి నివాళులర్పించారు.

# ఏనుగుల దాడిలో రైతు మృతి

**- పంట పొలాల్లోకి వచ్చిన ఏనుగులను తరమడానికి ప్రయత్నం**
**- రైతుపై దాడి చేసి చంపేసిన ఏనుగులు**




మృతి చెందిన సూరిమని గణపతి, మృతుని కుటుంబసభ్యులకు నష్టపరిహారం చెక్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్, డీఎఫ్ఓ భరణిలు

చిత్తూరు, ఐరాల, జూన్ 4 ప్రభాతవార్త:
జిల్లాలో ఏనుగుల దాడిలో బుధవారం మరో రైతు ప్రాణాలు కోల్పోయాడు. ఐరాల మండలం నాగం వాండ్లపల్లి గ్రామంలో బుధవారం తెల్లవారుజాము ఈ సంఘటన జరిగింది. గ్రామ అటవీ సరిహద్దులో వున్న తమ పొలాల వద్ద సూరిమాని గణపతి(60) రైతు కుటుంబంతో నివాసం వుంటున్నారు. ఈ క్రమంలో బుధవారం తెల్లవారుజామున రెండు ఏనుగులు అటవీ ప్రాంతం నుండి వచ్చి గణపతి పంట పొలాలపై దాడి చేశాయి. బయట అలికిడి వినడంతో నిద్రిస్తున్న గణపతిని భార్య మునీశ్వరీ లేపింది. ఈ మేరకు ఇంటి నుండి వెలుపలికి వచ్చి చూసిన గణపతికి రెండు ఏనుగులు తమ పంట పొలాలను ధ్వంసం చేస్తూ కన్పించాయి. పంట పొలాలను ధ్వంసం చేస్తున్న ఏనుగులను తరమడానికి గణపతి ప్రయత్నించాడు. ఈ క్రమంలో రెండు ఏనుగులు గణపతిపై దాడి చేయడంతో రైతు తీవ్ర గాయాలతో అక్కడికక్కడే పడి మృతి చెందాడు. భార్య మునీశ్వరీ తన భర్త గణపతిని ఏనుగులు దాడి చేసి చంపిన విషయంను గ్రామంలోని ప్రజలకు తెలియజేసింది. గ్రామస్తులు ఈ విషయంను అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో జిల్లా అటవీశాఖ అధికారిణి భరణి ఆధ్వర్యంలో వెస్ట్ ఫారెస్ట్ రేంజర్ బాలకృష్ణారెడ్డి నేతృత్వంలో ఫారెస్ట్ అధికారులు హుటాహుటిన సంఘటనా స్థలం చేరుకున్నారు. మృతుడు గణపతి కుటుంబంను పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ తెలుగుదేశం నాయకులతో కలిసి పరామర్శించారు. మృతుడు గణపతి కుటుంబానికి ప్రభుత్వం తరపున డిఎఫ్ఓ భరణి, ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్‌లు కలిసి 5 లక్షల రూపాయల చెక్కును అందజేశారు. ఐరాల మండల పరిధిలోని అటవీ ప్రాంతంలోకి ఏనుగులు ప్రవేశించడంతో అటవీ సరిహద్దు ప్రాంతాల్లో నివాసం వుంటున్న ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా అటవీశాఖ అధికారిణి భరణి కోరారు. రైతులు రాత్రి సమయాల్లో పంట పొలాల వద్ద నిద్రించరాదని, ఏనుగుల గుంపుకు సంబంధించి ఎదైనా సమాచారం వుంటే సత్వరం అటవీశాఖ అధికారులకు అందించాలన్నారు. ఐరాల మండల అటవీ సరిహద్దు గ్రామాల్లో గత రెండు సంవత్సరాలుగా ఏనుగులు తరచూ వచ్చి పంట పొలాలను ధ్వంసం చేస్తుండటంతో ఆ ప్రాంత ప్రజలు ప్రాణాలు అర చేతిలో పెట్టుకుని వణుకుతున్నారు. ఏ వైపు నుండి ఏనుగులు వస్తాయని రైతులు, గ్రామస్తులు భయాందోళనలకు గురవుతున్నారు.

## సూపర్ సిక్స్... అట్టర్ ఫ్లాప్

**మాజీ మంత్రి ఆర్.కె.రోజా**



నగరి పట్టణంలో వైసిపి ర్యాలీ

పుత్తూరు (నగరి), జూన్ 4 ప్రభాతవార్త :
సూపర్ సిక్స్ పథకాలని ఎన్నికల ప్రచారంలో ఊదరగొట్టిన తెలుగు దేశం, జనసేన, బిజెపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడా దైనా పెన్షన్లు ఇవ్వడం మినహా మిగిలిన పథకాలేవీ అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచారని టూరిజం శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా విమర్శించారు. ముఖ్యంగా మహిళలను నిలువునా మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు వెన్నుపోటు దినంలో భాగంగా బుధవారం నగరి పట్టణంలో వేలాది మందితో పట్టణంలో ఓం శక్తి గుడి నుంచి టవర్ క్లాక్ వరకూ భారీ ర్యాలీ నిర్వహించారు. రోజాతో పాటు నాయకులు, కార్యకర్తలంతా రెండు చెవుల్లో పువ్వులు పెట్టుకుని వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆర్డిఒకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్టీసి బస్సుల్లో ఉచిత ప్రయాణం, 18 సంవత్సరాలు దాటిన ప్రతి మహిళకు నెలకు రూ. 1500, ఇంట్లో ఎంత మంది పిల్లలు చదువుకుంటే అందరికీ రూ. 15,000 వేలు ఇచ్చే తల్లికి వందనం పథకాలను అమలు చేయలేదని తెలిపారు. వైసిపి ప్రభుత్వం ఇచ్చే పెన్షన్‌ను పెంచి ఇవ్వడం మినహా కూటమి ప్రభుత్వం ప్రజలను ఉద్ధరించింది ఏమీ లేదని తెలిపారు. నాడు - నేడు కింద ప్రతి ప్రభుత్వ పాఠశాలను వేల కోట్లతో ఆధునికీకరించారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికే ఎందుకు ఓటేశామా అని ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో 5మండలాలకు చెందిన వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వంపై ప్రజాగ్రహం

**- చిత్తూరు జిల్లాలో వైకాపా ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం**




చిత్తూరు, జూన్ 4 ప్రభాతవార్త:
రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయలేదని, ఎన్నికల్లో హామీలు ఇచ్చి అమలు చేయని కూటమి ప్రభుత్వం ప్రజలను వెన్నుపోటు పొడిచిందని ఆరోపిస్తూ వైకాపా ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం విజయవంతమైంది. నియోజకవర్గ కేంద్రాల్లో వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, నాయకులు, కార్యకర్తలు భారీ ర్యాలీగా బయలుదేరి నిరసన కార్యక్రమాలు నిర్వహించి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. జిల్లా కేంద్రం చిత్తూరులో వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంపి విసయానందరెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహించారు. చిత్తూరు- వేలూరు రహదారిలోని అమూల్ డైరీ నుండి కలెక్టరేట్ వరకు వైకాపా నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించి కలెక్టరేట్ ఎదుట నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డి ఆధ్వర్యంలో వైకాపా నాయకులు కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. పూతలపట్టు నియోజకవర్గంలో మండల కేంద్రం బంగారుపాళ్యంలో మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్‌కుమార్, లలితకుమారిల ఆధ్వర్యంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు వెన్నుపోటు దినం విజయవంతంగా నిర్వహించారు. బంగారుపాళ్యంలో భారీ ప్రదర్శన నిర్వహించి తహ సిల్దారు రాజేంద్రప్రసాద్‌ను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సునీల్‌కుమార్, లలిత కుమారిలు కలిసి వినతిపత్రం అందజేశారు. అలాగే గంగాధరనెల్లూరు ని యోజకవర్గంలో మాజీ డిప్యూటీ సిఎం నారాయణ స్వామి, కన్వీనర్ కృపా లక్ష్మీల ఆధ్వర్యంలో ఎస్ఆర్ పురం నుండి జిడినెల్లూరు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకు వైకాపా నాయకులు, కార్యక్తలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించి వెన్నుపోటు దినంను నిర్వహించారు. అనంతరం మాజీ డిప్యూటీ సిఎం నారాయణస్వామి, కన్వీనర్ కృపాలక్ష్మీల ఆధ్వర్యంలో వైకాపా నాయకులు ఆర్ఐను కలిసి వినతిపత్రం అందజేశారు. పలమనేరులో మాజీ ఎమ్మెల్యే వెంకటగౌడ, జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో వైకాపా నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ సర్కిల్ నుండి ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయ ఎఓ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. కుప్పంలో వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ, ఎమ్మెల్సీ భరత్ ఆధ్వర్యంలో వైకాపా నాయకులు, నాలుగు మండలాల కార్యకర్తలు వైఎస్ఆర్ విగ్రహం నుండి తహసిల్దారు కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి తహసిల్దారు చిట్టిబాబుకు వినతిపత్రం అందజేశారు. అలాగే పుంగనూరు, నగరిలో వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు, నాయకులు వెన్నుపోటు దినం నిర్వహించి ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి ఒక్క హామీని సత్వరం అమలు చేయాలని డిమాండ్ చేసి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

# సంపూర్ణ ఆరోగ్య ప్రదాయిణి యోగ



**అట్టహాసంగా రాయలవారి కోటలో 3 వేల మందితో యోగా చారిత్రాత్మకం**

చంద్రగిరి, జూన్ 4 ప్రభాతవార్త:
భారతీయ సంస్కృతిలో మన ఋషులు యోగ ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చనే విషయాన్ని నిరూపించినట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని తెలిపారు. చారిత్రాత్మకమైన చంద్రగిరి రాయలవారికోటలో బుధవారం జిల్లా పర్యాటక శాఖ ఆధ్వర్యంలో అట్టహాసంగా 3 వేల మందికిపైగా హాజరై యోగ దినోత్సవాన్ని జరుపుకున్నారు. ఆయన జిల్లా కలెక్టర్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన గావించి యోగ కార్యక్రమాన్ని ప్రారంభించారు. చంద్రగికోటలో లైటింగ్ షోను ప్రముఖ సంస్థ ద్వారా అభివృద్ధి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. అదేవిధంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రధాని, ముఖ్యమంత్రి పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర ప్రచారంలో భాగంగా తిరుపతి జిల్లాలో చంద్రగిరి కోటలో యోగ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు మే 21 నుండి జూన్ 21 వరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాలో జిల్లా స్థాయి నుండి మండలం, గ్రామ స్థాయి వరకు యోగ తీసుకెళ్ళి ప్రతి ఒక్కరికీ శిక్షణ ఇచ్చి అవగాహన కల్పించినట్లు తెలిపారు. శిక్షణ కొరకు 8 లక్షల మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు తెలిపారు. జూన్ 21న విశాఖపట్నంలో జరగనున్న రాష్ట్ర స్థాయి యోగ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా ప్రదాని నరేంద్రమోడీ పాల్గొంటారని అన్నారు. భారతీయ ప్రాచీన సంపద యోగ అన్నారు. ప్రతి ఒక్కరి జీవనశైలి దినచర్యలో యోగ ఒక భాగమవ్వాలని ఆకాంక్షించారు. అదేవిధంగా తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ రోజూవారీ దైనందిన జీవితంలో యోగ మనలోని మానసిక ఒత్తిడిని జయించడానికి దోహదపడుతుందన్నారు. రాష్ట్ర యాదవ కార్పోరేషన్ ఛైర్మన్ నరశింహ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పచ్చదనం, పరిశుభ్రతతో పాటు మనందిరి ఆరోగ్యం కొరకు యోగకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లు తెలిపారు. యోగ గురువును అనుసరిస్తూ మూడు వేల మంది ఒక్కతాటిపై ఆసనాలు వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నరశింహులు, ఆర్‌డిఓ రామ్మోహన్, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ రమణ ప్రసాద్, జిల్లా టూరిజం అధికారి జనార్ధన్ రెడ్డి, అధికారులు, ప్రజలు, ప్రజా ప్రతినిధులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని యోగ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

**కూటమి ప్రభుత్వానికి ఏడాది**

# శ్రీకాళహస్తిలో సంబరాలు

**ఐదేళ్ళలో ఆయన ఏం చేసారో శ్వేతపత్రం ఇవ్వమనండి: ఏడాదిలో మేము ఏం చేశామో? చెబుతాం: సుధీర్‌రెడ్డి**




శ్రీకాళహస్తి, జూన్ 4 ప్రభాతవార్త
ఐదేళ్ళ పరిపాలనలో వైకాపా శాసన సభ్యుడు బియ్యపు మధు సూధనరెడ్డి నియోజకవర్గాన్ని సర్వనాశనం చేసారని ఎక్కడ సెంటు భూమి కనబడితే వేసాయ్ పాగా అన్నట్లు పరిపా లించారని అభివృద్ధి ముసుగు లో కోట్లు దండుకున్నారని అయితే ఏడాది పాలనలో తాము శ్రీకాళహస్తి నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి కళ్ళకు కట్టినట్లు కనబడుతుందని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి అన్నారు. బుధవారం పార్టీ కార్యాలయంలో పరిపాలన చేపట్టి ఏడాది అయిన సందర్భంగా సంబరాలను జరుపుకున్నారు. పార్టీ శ్రేణులతో కలసి ఆయన ఎన్‌టిఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసారు. భారీ ఎత్తున కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అభివృద్ధికి సంబంధించి శ్వేత పత్రం విడుదల చేసారు. ఇప్పటి వరకు శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని అభివృద్ధి పనులకు సంబంధించి ఏ శాసనసభ్యుడు శ్వేత పత్రం విడుదల చేయలేదన్నారు. మాది తెల్లకాగితం పాలన అన్నారు. గతంలో పరిపాలించిన బియ్యపుమధుసూధనరెడ్డిని తాము ఆయన చేపట్టిన అభివృద్ధికి సంబంధించి శ్వేత పత్రం విడుదల చేయాలని కోరామన్నారు. 8 సంవత్సరాలుగా మూత పడ్డ స్కిట్‌ను పునఃప్రారంభించటానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్రతి గ్రామానికి నిధులు మంజూరు చేసిన ఘనత కూటమికే దక్కిందన్నారు. ఈ కార్యక్రమాల్లో గాలిచలపతి నాయుడు, విజయకుమార్‌నాయుడు, రంగినేని చెంచయ్యానాయుడు, సుబ్రమణ్యం రెడ్డి, పేరం ధనంజయులు నాయుడు, బషీర్, సుబ్బయ్యరేణుకాదేవి, కృష్ణ వేణి, సుమతి, అనిత తదితరులు పాల్గొన్నారు.

## ముత్యపు పందిరిపై అలంకారదేవుడు




తిరుపతి, జూన్ 4ప్రభాతవార్త:
గోవిందరాజస్వామికి జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడవరోజురాత్రి అలంకార దేవుడు విశేష అలంకారంలో ముత్యపుపందిరిపై ఊరేగి భక్తులను కటాక్షించారు. బుధవారం సాయంత్రం నిత్యకైంక ర్యాలు ముగిసిన తరువాత రాత్రి వాహనమండపంవద్ద ముత్యపుపందిరిపై వేంచేపుచేశారు. ఇక్కడ అర్చకులు వేదఘోష్టితో కర్పూరహారతులిచ్చారు. అనంతరం స్వామివారి వాహనం బయలుదేరి ఆలయ నాలుగుమాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చాడు. ముత్యాలు విలువైనవి. చల్లదనాన్ని ప్రసాదిస్తాయి. ఈ వాహనసేవలో పెద్ద జీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, ఆలయ డిప్యూటీ ఈఓ విఆర్ శాంతి, ఏఈఓ మునికృష్ణారెడ్డి, ఏవి ఎస్ఓ మోహన్‌రెడ్డి, అధికారులు, శ్రీవారిసేవకులు, అర్చకులు పాల్గొన్నారు.

**-ఉదయం సింహవాహనంపై:**

యోగనరసింహస్వామి అలంకారంలో గోవిందరాజులు సింహవాహనాన్ని అధిరోహించి భక్తులకు అభయమిచ్చాడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసం సింహవాహనంపై కూర్చుని ఊరేగారు. సింహం పరాక్రమానికి, ధైర్యానికి, తేజస్సుకు, ఆధిపత్యానికి, మహాధ్వనికి సంకేతం. సింహరూప దర్శనంతో అనేకశక్తులు చైతన్యవంతులవుతాయి.

**నిరుపయోగంగా మారిన**

# రైల్వే అండర్ బ్రిడ్జి



పూతలపట్టు, జూన్ 4, ప్రభాతవార్త
పి. కొత్తకోట, పాకాల రహదారి నందు అమర్ రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ వెళ్ళుటకు గతంలో ఉన్న పోటు కనుమ రైల్వే గేట్‌ను దక్షిణ మధ్య రైల్వే తీసివేసి అండర్ బ్రిడ్జిని నిర్మించడం జరిగినది. కాంట్రాక్టర్ వైఫల్యం కారణంగా సక్రమమైన ప్లాన్ అఫ్ యాక్షన్ లేకపోవడం వల్ల వర్షం పడితే నీరు బ్రిడ్జి కింద నీరు చెరువుల తలపించడం ప్రయాణికులకు సంకటంగా మారింది. అటు అమర్ రాజా గ్రూప్ ఆఫ్ కంపెనీస్‌కి వెళ్లే ఉద్యోగుల పరిస్థితి వారి వాహనాల పరిస్థితి దయానియంగా మారింది. అందులో పి కొత్తకోట పాకాల కు వెళ్ళుటకు బ్రిడ్జికి ఇరువైపులా రహదారి సూచికలు లేకపోవడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు కూడా ఎక్కువగా చవి చూడటం జరుగుతుంది. ఇకనైనా దక్షిణ మధ్య రైల్వే ఇంజనీరింగ్ అధికారులు రాష్ట్ర రోడ్డు రవాణా అధికారులు దీనిపై కలగజేసుకుని అటు ఉద్యోగుల సమస్యని ఇటు ప్రజల అసౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని మరమ్మతులు చేయవలసిందిగా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అలిపిరి తనిఖీ కేంద్రం పటిష్టం కావాలి

**-నేడు టిటిడి సివిఎస్‌ఓగా మురళీకృష్ణ బాధ్యతలు**

తిరుమల, జూన్ 4ప్రభాతవార్తప్రతినిధి:
తిరుమల భద్రతకు మూడంచెల తనిఖీలు జరుగుతున్నా...అలిపిరి తనిఖీ కేంద్రంలో పటిష్ట తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది. ప్రతిరోజూ లక్షమంది యాత్రికులు దేశం నలుమూలల నుండి పలు రకాలుగా ఏడుకొండలకు వస్తున్నారు. ఇలా వస్తున్న వారిలో ఎవరు, ఏమిటనేది స్పష్టంగా కనిపెట్టే వ్యవస్థ ఇప్పటికీ అలిపిరి తనిఖీ కేంద్రంలో ఏర్పాటులేదు. యాత్రికులు వస్తున్న వారిపై నిశితంగా గమనించే ఈ అధునాతన "ఫేస్‌చెక్"ద్వారా గుర్తించే విధానం అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. అంతటి ప్రాధాన్యత ఉన్న భక్తుల రక్షణతో బాటు వేంకటేశ్వర స్వామి కొలువైన తిరుమల ఆలయ భద్రతను మరింతగా పటిష్టంచేయాల్సి ఉంది. క్షణాల్లో భద్రత వ్యవస్థ అలర్ట్ అయ్యి మెరుపువేగంతో సంఘటనాస్థలికి చేరుకునేలా చూడాల్సిన అవసరం నూతన సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ గుర్తిస్తారని ఆశిస్తున్నారు. తిరుమల కొండకు ప్రధాన ప్రవేశద్వారమైన తిరుపతి అలిపిరి సప్తగిరి తనిఖీకేంద్రానికి ముందు వచ్చే అలిపిరి గరుడ ఆర్చి ప్రవేశ ద్వారం, ఆ తరువాత దీనికి కొంత పక్కనే భక్తుల కాలినడక మార్గం ఉంది. ఇవన్నీ దాటుకుని వస్తే సప్తగిరి తనిఖీ కేంద్రం (అలిపిరి టోల్‌గేట్)లో 12 వరుసల ప్రవేశ మార్గాలు ఉన్నాయి.. వాటిని కట్టడిచేయడంపై నూతన సివిఎస్ఓ మురళీకృష్ణ వ్యూహం ఏంటో చూడాల్సిందే .

## గిరిజన సంక్షేమానికి అధికారులు కృషి చేయండి

**-గిరిజన సంక్షేమ సాధికారత అధికారి మూర్తి**



పలమనేరు, జూన్ 4, ప్రభాతవార్త:
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలను గిరిజనులకు అందించేలా అన్ని శాఖ అధికారులు కృషి చేయాలని గిరిజన సంక్షేమ మరియు సాధికారత అధికారి మూర్తి తెలిపారు. పలమనేరు మండలంలోని జగమర్ల పంచాయితీ దేవలంపేట ఎస్టీ కాలనీలో ధర్తీ ఆబా జంజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్ పథకం(డిఎ జేజియూఎ)సంబంధించి ప్రజలకు ఆయన అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ డిఎ జేజియూఎ పథకం ద్వారా పలమనేరు మండలంలోని దేవలంపేట గిరిజన గ్రామాన్ని సమగ్ర మరియు స్థిరమైన అభివృద్ధికి అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో భూగర్భ జలా శాఖ డిడి గోవర్ధన్ రెడ్డి, జిల్లా మత్స్యశాఖ ఏడి రవీంద్ర రెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి గుణశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కల్తీనెయ్యిపై మూలాలు కదిలిస్తున్న "సిట్"




తిరుపతి, జూన్ 4ప్రభాతవార్త:
తిరుమల లడ్డూప్రసాదం తయారీలో కల్తీనెయ్యి వినియోగించారనే కేసులో "ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్) మళ్ళీ సూత్రదారుల మూలాలు కదిలించే దిశగా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పిఏ అప్పన్నతోబాటు మరు ఆరుగురు టిటిడి ఉద్యోగులను సిట్ అదుపులోకి తీసుకుని విచారణ చేస్తోంది. లోతుగా చేపట్టిన దర్యాప్తులో సాక్ష్యాధారాలు సేకరించిన సిట్ బృందం ఇప్పుడు గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలోని పూర్వటిటిడి ధర్మకర్తలమండలి పెద్దలు, టిటిడి ఉన్నతాధికారి, కొనుగోలుకమిటీలో కొందరిని విచారణ చేయడానికి సిద్ధమవుతోంది. వారికి అవసరమైన నోటీసులు జారీచేయాలని నిర్ణయించింది. టెండర్లలో పాల్గొన్న ఐదుసంస్థలు, కాంట్రాక్టర్ల వివరాలు సేకరించిన సిట్ అధికారులు కల్తీనెయ్యికి సూత్రధారులు ఎవరని తేల్చేపనిలో మూలాలు కదిలిస్తున్నారు. పవిత్రంగా భావించే లడ్డూప్రసాదాల తయారీకి ఎంత కాలంగా కల్తీనెయ్యి వినియోగించారు? అసలు నెయ్యిసరఫరా చేయాల్సిన సంస్థలు, కాంట్రాక్టర్ల స్థానంలో మరొకరు సరఫరా చేశారనేది సిట్ కీలకంగా సేకరించిన సమాచారం. తమిళనాడులోని దిండిగల్‌లో ఉన్న ఏఆర్ డైరీ నుండి సరఫరా కావాల్సిన నెయ్యి ట్యాంకర్ నెల్లూరులోని వైష్ణవి డైరీనుండి ఎందుకు సరఫరా చేశారనే కోణంలో సిట్ అధికారులు వివరాలు రాబట్టారు. మరీ కీలకంగా ఉన్నారనే అనుమానిస్తున్న పెద్దలను విచారణ చేసి వదిలేస్తారా? లేక కేసు నమోదు చేస్తారా అనేది ఈ వారంరోజుల్లో తేలిపోనుంది.

## నోడల్ అధికారిచే విద్యాసామగ్రిపై ఆకస్మిక తనిఖీలు



**కుప్పం/శాంతిపురం/రామకుప్పం, జూన్ 4 ప్రభాతవార్త** జిల్లా నోడల్ అధికారి, అమరావతి సమగ్ర శిక్ష డిడి అనురాధ బుధవారం కుప్పం, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో విద్యాశాఖ నిర్వహిస్తున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర సామగ్రి స్టాక్ పాయింట్లలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈసందర్భంగా ఇదివరకే సరఫరా చేసిన ఎస్ఆర్‌కెవిఎం సామగ్రిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టాక్ రిజిస్ట్రర్, పాఠ్య పుస్తకాలు, డిక్షనరీలు, గ్రంథాలయ పుస్తకాలు, బెల్టులను పరిశీలించారు. పిఎంశ్రీ, సన్నబియ్యం పంపిణీ, వృత్యంతర శిక్షణ, యోగాంధ్ర తదితర కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎసిఎంఓ మధుసూధన్, ఎంఇఓలు చంద్రశేఖర్, మహబూబ్ బాషా, ఎంఆర్‌సి సిబ్బంది పాల్గొన్నారు.

## రైతుల పక్షపాతి సిఎం చంద్రబాబు

**కుప్పంరూరల్ , జూన్ 4 ప్రభాతవార్త**



రైతుల పక్షపాతి సిఎం చంద్రబాబునాయుడు అని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం వెందుగంపల్లి గ్రామంలో రాయితీ వేరుసెనగ విత్తనాల పంపిణీని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుప్పంలో ఉన్న భూసార పరీక్ష కేంద్రాన్ని గత ప్రభుత్వం చిత్తూరుకు తరలించిందన్నారు. ఈవిషయాన్ని సిఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళ్లి మరలా కుప్పంలో ఏర్పాటయ్యేలా కృషి చేస్తామన్నారు. అధికారులు రైతులకు అందుబాటులో ఉంటూ పంటలసాగులో సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఎఓ ఫయాజ్ బాషా, విఎఎ సౌందర్ నాయక్, విహెచ్ఎ కార్తీక్, నేతలు రమేష్, రామచంద్ర, పార్థసారథి, అశోక్, లోకేష్, సుబ్బు, వేడి, సేటు, రైతులు పాల్గొన్నారు.

## ఘనంగా కూటమి ప్రభుత్వ విజయోత్సవ వేడుకలు



***యర్రావారిపాలెం, జూన్ 4, ప్రభాతవార్త:*** మండల కేంద్రంలో కూటమి పార్టీల ఆధ్వర్యంలో విజయోత్సవం వేడుకలకు ఘనంగా నిర్వహించారు. 30 సంవత్సరాలు తర్వాత చంద్రగిరి కోట మీద తెలుగుదేశం పార్టీ జెండా ఎగురవేయడం జరిగిందన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుపుకు సహకరించిన ప్రతి ఒక్కరికి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి పార్టీ గెలిచి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా యర్రావారిపాలెం మండలంలో కూటమి నాయకులు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. గత సంవత్సరకాలం నుంచి చేసిన అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తూ,వైసీపీ లాగా సైకో పాలన చేయలేదని ప్రజా పరిపాలన చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు దేశిరెడ్డి రఘునాథ, ప్రధాన కార్యదర్శి మహేష్ నాయుడు,రాష్ట్ర రజకకార్పొరేషన్ డైరక్టర్ అన్నసముద్రం మధు, తలకోన బోర్డు చైర్మన్ సోమునాధ రెడ్డి, యువత అధ్యక్షులు నిరంజన్ జనసేనమండలపార్టీ అధ్యక్షులు మురళి కూటమి నాయకులు కార్యకర్తలు మహిళలు అధికసంఖ్య లో పాల్గొన్నారు.

## మున్సిపాల్టీల్లో వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ

**- కలెక్టర్ సుమిత్‌కుమార్**

***చిత్తూరు, జూన్ 4 ప్రభాతవార్త:*** జిల్లాలోని మున్సిపాల్టీల్లో ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం జరుగాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశహాలు నుండి బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలోని మున్సిపాల్టీల పరిధిలో పారిశుధ్యం, మౌళిక వసతులపై మున్సిపల్ కమీషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాల్టీల్లోని వార్డు సచివాలయాల్లో చెత్త సేకరణపై శానిటరీ ఇన్స్‌పెక్టర్ల సంతకాలతో నివేదికలు తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. మున్సిపాల్టీల పరిధిలో పన్నుల వసూళ్ళను సమర్థవంతంగా చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి మున్సిపల్ కమీషనర్లు హాజరయ్యారు.

## మున్సిపాల్టీల్లో వంద శాతం ఇంటింటి చెత్త సేకరణ

***చిత్తూరు, జూన్ 4 ప్రభాతవార్త:*** జిల్లాలోని మున్సిపాల్టీల్లో ఇంటింటి చెత్త సేకరణ వంద శాతం జరుగాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశహాలు నుండి బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ జిల్లాలోని మున్సిపాల్టీల పరిధిలో పారిశుధ్యం, మౌళిక వసతులపై మున్సిపల్ కమీషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపాల్టీల్లోని వార్డు సచివాలయాల్లో చెత్త సేకరణపై శానిటరీ ఇన్స్‌పెక్టర్ల సంతకాలతో నివేదికలు తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. మున్సిపాల్టీల పరిధిలో పన్నుల వసూళ్ళను సమర్థవంతంగా చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు చిత్తూరు, కుప్పం, పలమనేరు, పుంగనూరు, నగరి మున్సిపల్ కమీషనర్లు హాజరయ్యారు.

## కూటమి ఏడాది సంబరాలు



***పుంగనూరు రూరల్, జూన్ 4, ప్రభాతవార్త*** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా బుధవారం సాయంకాలం కూటమి, నాయకుల ఆధ్వర్యంలో గోకుల్ సర్కిల్ వద్ద బాణ సంచా పేల్చుతూ ఒకరికొకరు మిఠాయి తినిపించు కుంటూ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సివిరెడ్డి, మాధవరెడ్డి పోలీసు గిరి, ఇబ్రహీం, అయూబ్ ఖాన్,నరసింహులు, జనసేన పార్టీ నాయకులు శివకుమార్ రెడ్డి, ఎన్.డి. ఎ.కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుంగునూరులో వెన్నుపోటు నిరసన

***పుంగునూరు రూరల్, జూన్ 4, ప్రభాతవార్త***




పట్టణంలో వైఎస్ఆర్సిపి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం నిర్వహించారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వైఎస్సార్ విగ్రహా నికి పూలమాలవేసి నివాళులర్పించారు. తర్వాత కార్యకర్త లతో కలిసి ఎమ్మార్వో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ఎమ్మార్వోకు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్ఆర్సిపి నేతలు పాల్గొన్నారు.

## విహెచ్‌పీని గ్రామ స్థాయిలో విస్తరింపజేయాలి



**తవణంపల్లె, జూన్ 4 ప్రభాతవార్త:** విశ్వ హిందూ పరిషత్‌ను గ్రామస్థాయిలో విస్తరింపజేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి శివకుమార్ అన్నారు. బుధవారం మండలంలోని అరగొండ శ్రీకోదండరామస్వామి దేవస్థానంలో ఐరాల ప్రఖండ విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన శివకుమార్ మాట్లాడుతూ సనాతన ధర్మ పరిరక్షణ కోసం, దేవాలయాల పరిరక్షణ కోసం, హిందువుల ధన, మాన ప్రాణాలు కాపాడటం కోసం కృషి చేద్దామని కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. అలాగే కొత్త కార్యకర్తలను చేర్చుకుంటూ విశ్వ హిందూ పరిషత్‌ను ప్రతి గ్రామానికి, ప్రతి హిందువుకు చేరువ చేయాలని సమావేశంలో తీర్మానించారు. ఈకార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పంపిణీకి సిద్ధంగా ఉన్న వేరుశనగ విత్తనాలు

**పూతలపట్టు, జూన్ 4, ప్రభాతవార్త** ప్రస్తుత ఖరీఫ్ 2025 సీజనకు పూతలపట్టు మండలానికి 1140 వందల క్వింటాలు వేరుశనగ విత్తనకాయలు కేటాయించినట్లు మండల వ్యవసాయ అధికారిని మధురవాణి తెలిపారు. మండలానికి 1700 వందలు క్వింటాలు వేరుశెనగ విత్తనాలు కావలసి ఉందన్నారు సదరు విత్తనాలను మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రంలో పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తెలిపారు ఒక బస్తా30కేజీలు పూర్తి ధర 2790 ఉంటుందన్నారు. సబ్సిడీ పోను 1674 రూపాయలు చెల్లించాలన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రారంభం

**పూతలపట్టు, జూన్ 4, ప్రభాతవార్త** ప్రభుత్వ జూనియర్ కళాశాల ఈ నెల 02వ తేదీ నుంచి క్లాసులు ప్రారంభమైయ్యాయని ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఫస్ట్ ఇయర్ అడ్మిషన్స్ జరుగుచున్నవి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వము ఉచితంగా కళాశాల ప్రారంభం రోజే పాఠ్యపుస్తకాలు ఉచితంగా అందజేయడం జరిగింది. అదేవిధంగా ప్రభుత్వ ఆదేశాల మేరకు, యోగ దే పురస్కరించుకుని 2వ తేది నుండి 21వ తేది వరకు యోగ దే ప్రతిరోజు కళాశాలలో నిర్వహించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్, ఆధ్యాపకులు జీవీ సత్యనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## డిసిసిబి చైర్మెన్‌కు ఎమ్మెల్యే అభినందనలు



**చిత్తూరురూరల్, 4 ప్రభాతవార్త:** చిత్తూరుజిల్లా డిసిసిబీ చైర్మెన్‌గా ప్రమాణస్వీకారం చేసిన ఆమాస రాజశేఖరరెడ్డికి చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు జిల్లా తెదేపా అధ్యక్షులు సిఆర్ రాజన్, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు, తెదేపా నాయకులు చంద్రప్రకాష్ తదితరులు వున్నారు.

## గాయపడిన యువకుడిని పరామర్శించిన ఎమ్మెల్యే

**చిత్తూరురూరల్, జూన్ 4 ప్రభాతవార్త:** ఇటీవల వర్షానికి రోడ్డులో చెట్టు కూలిన ఘటనలో గాయపడిన మిట్టూరుకు చెందిన యువకుడు యశ్వంత్‌ను చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ బుధవారం ఇంటికి వెళ్లి పరామర్శించారు. అతని ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకొని మెరుగైన చికిత్స కోసం రూ. లక్ష ఆర్థిక సాయం అందజేసి, అన్ని విధాలుగా ఆదుకొంటామని కుటుంబసభ్యులకు ధైర్యం చేసారు. పరామర్శించిన వారిలో తెదేపా నాయకులు వసంత్‌కుమార్ తదితరులు వున్నారు.

## పోలీసులు యువకులను నడిరోడ్డుపై కొట్టడం చట్ట విరుద్ధం

**- హ్యూమన్ రైట్స్‌ప్రొటెక్షన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు**

***చిత్తూరురూరల్, జూన్ 4 ప్రభాతవార్త:*** తెనాలిలో ముగ్గురు యువకులపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించడం బాధాకరమని, వారిపై కేసులు వుంటే కోర్టులో హాజరుపరచాలే తప్ప వారిని కొట్టడం చట్ట విరుద్ధమని హ్యూమన్ రైట్స్‌ప్రొటెక్షన్ సెల్ జిల్లా అధ్యక్షుడు రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. పోలీస్ అధికారులు చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకొని కొట్టడం, మానవ హక్కులను ఉల్లంఘించినట్లేనని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారు ఎవరైనా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

## వరసిద్దుని దర్శించుకున్న టీటీడీ సీవిఎస్ఓ

**కాణిపాకం, జూన్ 4 ప్రభాతవార్త:**



తిరుమల తిరుపతి దేవస్థానం ఛీఫ్ విజిలెన్స్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళీకృష్ణ బుధవారం కాణిపాకం శ్రీవరసిద్ది వినాయక స్వామివారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వేదమండపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోగా త్రివిక్రమరావు బాధ్యతల స్వీకరణ

**సత్యవేడు, జూన్ 4 ప్రభాతవార్త:**



సత్యవేడు మండల పరిషత్ పరిపాలన అధికారిగా త్రివిక్రమరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిషత్ పరిపాలన అధికారిగా పని చేస్తున్న త్రివిక్రమరావు సాధారణ బదిలీల్లో భాగంగా సత్యవేడుకు వచ్చారు. ఇక్కడ పరిపాలన అధికారిగా పని చేయాల్సిన మోతి డిప్యూటేషన్స్ జిల్లా కలెక్టరేట్లో పనిచేస్తూ బుచ్చినాయుడు కండ్రిగకు బదిలీ కావడం జరిగింది. ఈ నేపథ్యంలో మండల పరిషత్ పరిపాలన అధికారిగా త్రివిక్రమరావు బాధ్యతలు స్వీకరించారు. ఈ క్రమంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన త్రివిక్రమరావు వా నెల్లూరు గ్రామ సర్పంచ్ ఆశాలత ఎబినైజర్ శాలువ కప్పి ఘనంగా సత్కరించారు.

## రైతులకు రాయితీ వేరుశనగవిత్తనాలు పంపిణీ

**పెద్దపంజాణి జూన్4 ప్రభాతవార్త:**



రాష్ట్రప్రభుత్వం ఖరీఫ్‌సీజన్లో రైతులకు ఏటా అందించే రాయితీ వేరుశనగ విత్తనాలు పంపిణీ కార్యక్రమాన్ని బుధవారం మండలంలో ఎంపీపీ రెడ్డెప్ప జిల్లా వ్యవసాయ అదికారి మురళీక్రిష్ణ ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి విజయ్ భాస్కర్ రెడ్డి,టిడిపి మండల ఇంచార్జ్ మురహరిరెడ్డి,శ్రీరాయులు,సుధాకర్ రెడ్డి,చలపతి, చెంగారెడ్డి,భాను ప్రతాప్ రెడ్డి,రుద్రమూర్తి నాయుడు,క్రిష్ణారెడ్డి,వేణుగోపాల్ నాయుడు,వేమారెడ్డి ,గంగప్ప,ఎంఎఓరఖీభా,పుంగనూరువ్యవసాయసంచాలకులు శివకుమార్,రైతులు,ఆర్‌బికె సిబ్బంది పాల్గొన్నారు.

## వైసిపి విషప్రచారాన్ని ఎవరు నమ్మరు



***పూతలపట్టు, జూన్ 4, ప్రభాతవార్త*** వైసిపి విష ప్రచారాన్ని ఎవరు నమ్మరని టిడిపి సీనియర్ నాయకులు గుంటూరు మురళి పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ నమ్ముకున్న ప్రజలకు వెన్నుపోటు పొడిచిన ఘన చరిత్ర వైకాపా అధినేత జగన్మోహన్ రెడ్డిదేనని విమర్శించారు. ఇలాంటి ప్రచారాలను ప్రజలు నమ్మరని స్పష్టం చేశారు. తమ నేత చంద్రబాబు నాయుడు నిరంతరం నియోజకవర్గాల అభివృద్ధి కోసం కృషి చేస్తూ అవసరమైన నిధులు అందిస్తూ ఎనలేని సేవలు చేస్తూ వ్యక్తి అని కొనియాడారు. ఎన్ని అడ్డంకులు సృష్టించిన ప్రజలు కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారని గుంటూరు మురళి స్పష్టం చేశారు.

## జనసేనచే రంగవల్లుల పోటీలు.. దీపాల వెలిగింపు

**కుప్పం, జూన్ 4 ప్రభాతవార్త**



ఎన్డీయే కూటమి అధికారంలో వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా కుప్పంలో జనసేన కోఆర్డినేటర్ నరేష్ ఆధ్వర్యంలో సుపరిపాలనకు ఏడాది కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక శివాజీ సర్కిల్ వద్ద మహిళలకు రంగవల్లుల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. సాయంత్రం ఇళ్ల వద్ద దీపాలు వెలిగించే కార్యక్రమంతో పాటు పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఆయన మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు కార్యక్రమాలు చేపట్టామన్నారు. పవన్ మహేష్, నవనీత, జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

## కూటమి ఏడాది సంబరాలు

**పుంగనూరు రూరల్, జూన్ 4, ప్రభాతవార్త** ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తయిన సందర్భంగా బుధవారం సాయంకాలం కూటమి, నాయకుల ఆధ్వర్యంలో గోకుల్ సర్కిల్ వద్ద బాణసంచా పేల్చుతూ ఒకరికొకరు మిఠాయి తినిపించుకుంటూ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సివిరెడ్డి, మాధవరెడ్డి పోలీసు గిరి, ఇబ్రహీం, అయూబ్ ఖాన్,నరసింహులు, జనసేన పార్టీ నాయకులు శివకుమార్ రెడ్డి, ఎన్.డి. ఎ.కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.4 పిజిఆర్

చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని గాలికి వదిలేసింది



***పలమనేరు,జూన్ 4,ప్రభాతవార్త:*** ప్రజలను వెన్నుపోటు పొడిచి నేటికి ఏడాది కావచ్చిందని పలమనేరు మాజీ ఎమ్మెల్యే డా.వెంకటేగౌడా విమర్శించారు.బుధవారం వైకాపా అధిష్ఠానం పిలుపు మేరకు స్థానిక ఆర్డీఓ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి ఆర్డీఓ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే డా.వెంకటేగౌడా మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీలను కూటమి ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు.కూటమి ప్రభుత్వంలో మద్యం ఏరులైపారుతుందని ఎక్కడపడితే అక్కడా బెల్టు షాపులు ఉన్నాయన్నారు.కూటమి ప్రభుత్వం పేదలకు ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందిస్తుంటే వ్యవస్థను రద్దు చేసి పేదలు,మృద్దులను షాపుల వద్ద రోజుల తరబడి నిలబెట్టడం జరిగిందన్నారు.రాష్ట్రంలో గంజాయి విక్రయాలు విచ్చలవిడిగా జరుగుతుందన్నారు.వాలంటీర్లకు రూ.10 వేలు ఇస్తామని ఆ నాడు హామీ ఇచ్చి నేడి వారిని పూర్తిగా తొలగించడంసరికాదన్నారు. ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నమ్మించి నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం - నూక తోటి రాజేష్

**సత్యవేడు, జూన్ 4 ప్రభాతవార్త:**



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీల్లో ఏడాది కాలంలో ఒక్కటి కూడా పూర్తిగా అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడిచిందని, వెన్నుపోటు అనేదానికి చంద్రబాబు పేటెంట్ అని సత్యవేడు వైసీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ మండి పడ్డారు. వైసీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమంలో భాగంగా బుధవారం వైసీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ నేతృత్వంలో సత్యవేడు నియోజకవర్గంలోని ఏడు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు నడుమ వరదయ్యపాళెం మండల కేంద్రంలోని దివంగత నేత వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించి, అక్కడి నుంచి వైసీపీ శ్రేణులతో కలసి వరదయ్యపాళెం తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ఎత్తున వందలాది మందితో ర్యాలీగా వెళ్లి, రెవెన్యూ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం స్థానిక మీడియా ప్రతినిధులతో మాట్లాడిన నూకతోటి ఎన్నికల అప్పుడు బాబు షూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ అన్నారు. కానీ ఏడాది తిరగేలోపే బాబు షూరిటీ-మోసం గ్యారెంటీ అనిపించుకున్నారని రాజేష్ విమర్శలు గుప్పించారు. కార్యక్రమంలో 7 మండలాలకు చెందిన మండల అధ్యక్షులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వం హామీలు అమలు చేయాలి - ఎమ్మెల్సీ భరత్

**- కుప్పంలో వెన్నుపోటు దినం ర్యాలీ !!**



**కుప్పం, జూన్ 4 ప్రభాతవార్త** ఎన్నికలకు ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని ఎమ్మెల్సీ, కుప్పం వైకాపా ఇన్‌చార్జ్ భరత్ పేర్కొన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు బుధవారం కుప్పంలో ఎమ్మెల్సీ భరత్ అధ్వర్యంలో వెన్నుపోటు దినం ర్యాలీ నిర్వహించారు. స్థానిక వైఎస్ఆర్ విగ్రహం వద్ద నుంచి తహాశీల్దార్ కార్యాలయం దాకా ఈ ర్యాలీ పోలీసు బందోబస్తు నడమ కొనసాగింది.నాలుగు మండలాలకు చెందిన పార్టీ శ్రేణులు, కార్యకర్తలు హాజరయ్యారు. అనంతరం కుప్పం తహాశీల్దార్ చిట్టిబాబుకు ఎమ్మెల్సీ భరత్ పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమాల్లో గుడుపల్లె జడ్పీటిసి కృష్ణమూర్తి, మున్సిపల్ వైకాపా అధ్యక్షుడు హాఫీజ్, రామకుప్పం అధ్యక్షుడు బాబురెడ్డి, నేతలు పెద్దన్న, మోహన్‌రాం, రామూర్తి తదితరులు పాల్గొన్నారు. కాగా 30 పోలీస్ యాక్ట్ నిబంధనలు ఉల్లంఘించారని ఎమ్మెల్సీ భరత్‌తో సహా 35 మంది వైసిపి శ్రేణులపై కుప్పం పోలీసులు కేసు నమదు చేశారు.

## వేరుశెనగ విత్తనాల కోసం నమోదు చేసుకోండి

**మండల వ్యవసాయాధికారిణి వనిత**

**వెదురుకుప్పం, జూన్ 4 ప్రభాతవార్త :** ప్రభుత్వం అందజేసే సబ్సీడి వేరుశెనగ విత్తనాలు అవసరమైన రైతులు రైతు సేవ కేంద్రాలలలో నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి వనిత బుధవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ సబ్సీడి విత్తనాలు అవసరమైన రైతులు ముందుగా నమోదు చేసుకోవాలన్నారు. మండలంలోని వెదురుకుప్పం, కొమరగుంట, మాంబేడు,ఆళ్ళమడుగు, తిరుమలయ్యపల్లె, నల్లవెంగనపల్లె జక్కదొన రైతు సేవా కేంద్రాలలో జూన్ 5 అనగా గురువారం ఉదయం 9 గంటలకు రిజిస్ట్రేషన్ జరుగుతుందన్నారు. అలాగే జూన్ 9న సోమవారం ఉదయం 9 గంటలకు బ్రాహ్మణపల్లె, బొమ్మయ్యపల్లె,పాతగుంట,పెరుమాళ్ళపల్లె,పచ్చికాపల్లంరైతుసేవాకేంద్రాలలోనమోదుజరుగుతుందన్నారు.

## వందరోజుల ప్రణాళికతో క్షయ నిర్మూలనకు కృషి : పవన్‌కుమార్



***చౌడేపల్లి, జూన్ 4 ప్రభాతవార్త*** క్షయవ్యాధి నిర్మూలనకు వంద రోజుల ప్రణాళితో కృషి చేస్తున్నట్లు మండల వైద్యాధికారి పవన్‌కుమార్ అన్నారు. స్థానిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో క్షయ ముక్త్‌భారత్ ర్యాలీ నిర్వహించారు. అదేవిధంగా వందరోజుల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్ళి వ్యాధిపట్ల అవగాహన, దీర్ఘవ్యాధిగ్రస్తులు, మద్యపానం, పొగతాగేవారినీ, 60యేళ్ళు పైబడివారికి ప్రత్యేక సర్వేచేయడంవంటిచర్యలుచేపడుతున్నట్లు వివరించారు. ఆరోగ్య కేంద్రం అధికార, సిబ్బంది పాల్గొన్నారు.

## ఒంటికి యోగా మంచిదేగా... : జయప్రకాష్



**చౌడేపల్లి, జూన్ 4 ప్రభాతవార్త** ఆరోగ్యవంతమైన జీవితం కోసం యోగాతో ఉదయాన్ని ప్రారంభించాలని ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ జయప్రకాష్ అన్నారు. జూన్ 21న నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం యోగాంధ్రలో భాగంగా విద్యార్థులచే యోగాసనాలు వేయించారు. యోగా వల్ల కల్గే ప్రయోజనాలను వారికి వివరించారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## నేటి నుంచి విత్తన శెనక్కాయలు పంపిణీ

***చౌడేపల్లి, జూన్ 4 ప్రభాతవార్త*** మండల వ్యాప్తంగా ఈనెల 5నుంచి విత్తన శెనక్కాయల పంపిణీని చేపడుతున్నట్లు ఎఓ జ్యోతమ్మ తెలిపారు. 5న గడ్డంవారిపల్లి, 6న చారాల, దుర్గసముద్రం, ఎ.కొత్తకోట, కాగతి, కాటిపేరి, పందిళ్ళపల్లి, లద్దిగం, 8న చౌడేపల్లి, పరికిదొన, 9న పెద్దకొండామర్రి, వెంగళపల్లి, 10న 29.ఎ.చింతమాకులపల్లి, దిగువపల్లిరైతుసేవాకేంద్రాల్లో రైతులుపేర్లననమోదుచేయించు కోవాలన్నారు.

## వైఎస్ షర్మిల జిల్లా పర్యటనను విజయవంతం చేయండి

**చిత్తూరురూరల్, జూన్ 4 ప్రభాతవార్త:**

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఈనెల 9న జిల్లాకు విచ్చేస్తున్న సందర్భంగా ఆమె పర్యటను విజయవంతం చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పోటుగారి భాస్కర్ కోరారు. ప్రెస్‌క్లబ్ నందు ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి గ్రామస్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ

## ప్రతిపక్షం ప్రజల సమస్యలపై పోరాడి ఉనికిని కాపాడుకోవాలి



***విజయపురం, జూన్ 4 ప్రభాతవార్త:*** ప్రతిపక్షమైన వైసీపీ నాయకులు ప్రజా సమస్యలపై పోరాడి మీ ఉనికిని కాపాడుకోవాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు జి.రమేష్‌రాజు హితవు పలికారు. విజయపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు ఉపయోగపడే పనులకు శ్రీకారం చుట్టి అమలు పరుస్తున్నప్పటికి ప్రతిపక్షం ఓర్చుకోలేక, గత వైసీపీ హయాంలో ఐదేళ్ళలో సాండ్, ల్యాండ్, మైనింగ్ ద్వారా అక్రమ సంపాదనే ధ్యేయంగా మాజీ ముఖ్యమంత్రి జగన్‌తో పాటు ఆ పార్టీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులు దోచుకున్నారని దుయ్యబట్టారు. గత ఐదేళ్ళ అరాచక పాలనకు ప్రజలు 11 మంది ఎమ్మెల్యేలను ఇస్తే తప్పుడు ప్రచారాలతో ముందుకు సాగుతున్నారని ఎద్దేవా చేశారు. ఇదే విధంగా ప్రవర్తిస్తే రాబోయే రోజుల్లో వైసీపీ పార్టీ భవిష్యత్ శూన్యమని ప్రజలు చర్చించుకుంటున్నారని తెలిపారు.ఇప్పటికైనాప్రతిపక్షం వైసీపీ ప్రజల సమస్యలపై పోరాడి ఉనికిని కాపాడుకోవాలని సూచించారు.

## వెన్నుపోటు నిరసన కార్యక్రమానికి తరలివెళ్లిన ...

**విజయపురం, జూన్ 4 ప్రభాతవార్త:**



మాజీ మంత్రి రోజా సెల్వమణి ఆధ్వర్యంలో నగరిలో బుధవారం జరిగిన వెన్నుపోటు నిరసన కార్యక్రమానికి విజయపురం మండలం నుంచి పలువురు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. తరలివెళ్లిన వారిలో వైసీపీ మండల కన్వీనర్ శివరాజు, వైసీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గుణశేఖర్ రెడ్డి, పంచాయతీరాజ్ కార్యదర్శి గోవర్ధన్‌నాయుడు, ప్రచార కార్యదర్శి శేఖర్‌రాజు, ఉపాధ్యక్షుడు సతీష్ యాదవ్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు నాగరాజు, నాయకులు గోపినాథ్, ప్రసన్నకుమార్, శ్రీరాములు రెడ్డి, సుబ్బుయాదవ్, దిలీప్ కుమార్, మనోహర్‌రెడ్డి, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## అప్పలాయగుంట బ్రహ్మోత్సవాలకు రండి

**- ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు ఆహ్వానం**



**వడమాలపేట, జూన్ 4 ప్రభాతవార్త:** అప్పలాయగుంటలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు రావాల్సిందిగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌ను టీటీడీ అధికారులు ఆహ్వానించారు. బుధవారం తిరుపతిలోని ఎమ్మెల్యే ఇంటికి వెళ్లిన అధికారులు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా కంకణ బట్టార్ తిప్పయచార్యులు ఆశీర్వచనాలు అందజేశారు. బ్రహ్మోత్సవాలు ఏర్పాట్లు ఎలా జరుగుతున్నాయని ఎమ్మెల్యే అధికారులను అడిగి తెలుసుకున్నారు. బ్రహ్మోత్సవాలకు తప్పక వస్తానని భానుప్రకాష్ తెలిపారు. టీటీడీ డిప్యూటీ ఈవో హరినాథ్, ఆలయ అధికారి శివకుమార్ పాల్గొన్నారు.

**సరదా యాత్ర...కానీ సాహసమే హైదరాబాద్ నుంచి తిరుపతికి సైకిల్ యాత్రను దిగ్విజయంగా సాగించిన కేంద్ర ప్రభుత్వ సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేసి రిటైర్డ్ అయిన అధికారి జీవీ గణేష్ కుమార్**

**ప్రభాతవార్త తిరుపతి**



# దళిత విద్యార్థిపై దాడి కేసులో మరో ఆరుగురు అరెస్ట్

**తిరుచానూరు, జూన్ 4, ప్రభాతవార్త**

దళిత విద్యార్థిపై దాడి కేసులో మరో ఆరుగురు నిందితులు పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ సమాచారం మేరకు తిరుపతి ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాలతో గతంలో దళిత విద్యార్థిపై దాడికి పాల్పడిన 12 మంది నిందితులను సబ్ డివిజన్ డిఎస్పి ప్రసాద్, తిరుచానూరు సిఐ సునీల్ కుమార్ తమ ప్రత్యేక బృందంతో అరెస్టు చేసిన విషయం విధితమే. మిగిలిన నిందితులను అదే ప్రత్యేక బృందం పక్కా సమాచారంతో ఆరుగురు నిందితులను మంగళవారం అరెస్టు చేశారు. గత కొన్ని రోజులుగా దళిత విద్యార్థులపై దాడి కేసు జిల్లా వ్యాప్తంగా సంచలనంగా మారింది. ఈ కేసును తీవ్రంగా పరిగణించిన తిరుపతి ఎస్పీ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి త్వరత గతిన నిందితులను అరెస్టు చేయాలని ఆదేశించారు. ఇందులో భాగంగా డీఎస్పీ ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందం మిగిలిన ఆరుగురు నిందితులను అరెస్టు చేశారు. తిరుచానూరు గ్రామీణ మండలం పాడిపేట సమీపంలో శేషాద్రి నగర్ కాలనీ మూలస్థానమ్మ ఆలయ వద్ద గుమిగూడి ఉండగా పక్కా సమాచారంతో నిందితులను అరెస్టు చేశారు. వంశీ, దీపక్, తేజ, సాయి, రూపేష్ మొదలగు నిందితులను అరెస్టు చేశారు. ఇందులో రూపేష్ అనే ముద్దాయి గతంలో హత్యాయత్నానికి పాల్పడిన కేసు ఉండటంతో అతనిపై రౌడీషీట్ ఓపెన్ చేశారు. అదే విధంగా వంశీ, జగదీష్ పై గతంలో వివిధ కేసులు ఉండడంతో వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. దళిత విద్యార్థి పై దాడి కేసులో నిందితుల అందర్నీ అరెస్టు చేసిన తమ సిబ్బంది డిఎస్పి, సీఐతో పాటు ఎస్సైలు సాయినాథ్ చౌదరి, జగన్నాధరెడ్డి, రామకృష్ణ, రాఘవేంద్రలను అభినందించారు. మరో మా రు విద్యార్థులు గ్రూపులుగా మారి గొడవలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# వెన్నుపోటు పడడం సీఎంకి పేటెంట్ హక్కు

**- వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి**




వెంకటగిరి, జూన్ 4 ప్రభాతవార్త : వెన్నుపోటు పడడం సీఎం చంద్రబాబు నాయుడుకి పేటెంట్ హక్కు లాంటిదని వైసిపి నియోజకవర్గం సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. వెన్నుపోటు దినం సందర్భంగా నేదురుమల్లి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు పట్టణంలో సిద్దలయ్య సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజల పక్షాన ఉండి పోరాడుతానని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చెప్పి ఇప్పుడు హామీలు నెరవేర్చకపోయినా ఏమీ మాట్లాడడం లేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో భాగస్వాంగా ఉండి ప్రజలతో ఉంటానని చెప్పి ఇప్పుడు పట్టించుకోవడం లేదన్నారు. వైసిపి వెన్నుపోటు దినం నిర్వహిస్తుంటే కొన్ని మీడియాల వారు వక్రీకరిస్తున్నట్లు విమర్శించారు. అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం సంవత్సర కాలం గడిచిన సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయలేదన్నారు. కూటమి అధికారానికి ఇచ్చి సంవత్సరమైనా ఒక్క పథకం అమలు చేయకుండా ప్రజలను వెన్నుపోటు పొడవడం సమంజసం కాదు అని తెలిపారు. కూటమి ప్రభుత్వం ఎక్కువ కాలం ఉండదని చెప్పారు. రాష్ట్ర ప్రజలు అన్ని గమనిస్తున్నారని ప్రభుత్వానికి తగు గుణపాఠం చెప్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ నక్కా భానుప్రియ, వైస్ చైర్మన్ బాలయ్య, కన్వీనర్లు ప్రసాద్ రెడ్డి శ్రీనివాసులు రెడ్డి, చింతల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు కళ్యాణి, వహీదా, శ్రీనివాసరెడ్డి నారాయణ, సుబ్బారావు, వైసిపి జిల్లా మాజీ కార్యదర్శి హరికృష్ణ, తదితరు నాయకులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## కుక్కల దాడిలో జింక మృతి



కోట, జూన్ 4 ప్రభాతవార్త : మండలం కొత్తపాలెం గ్రామ సమీపంలోని చల్లా కాలువ వద్ద బుధవారం ఓ జింక దాహార్తి తీర్చుకునేందుకు నీటి కోసం వచ్చింది. ఆ జింకను కుక్కలు చూసి వెంబడించాయి. జింకపై కుక్కలు దాడి చేసి మెడ వద్ద తీవ్రంగా గాయపరిచాయి. స్థానికులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అప్పటికే ఆ జింక మృతిచెందింది. బీట్ ఆఫీసర్ శ్రీనివాసులు ఆ జింకను పశువైద్యశాలకు తీసుకెళ్లి పోస్టుమార్టం నిర్వహించారు.

## ఆర్యభట్టనగర్‌కు మౌలిక సదుపాయాలు కల్పించండి

సూళ్లూరుపేట, జూన్ 4 ప్రభాతవార్త : మున్సిపాలిటీ పరిధిలోని ఆర్యభట్టనగర్‌కు మౌలిక సదుపాయాలు కల్పించాలని షార్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేసన్ ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు ఆర్యభట్టనగర్‌లో రోడ్లు, పారిశుధ్యం, వీధిదీపాలు, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని, వీటిని తక్షణమే ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పట్టణ నడిబొడ్డులోని రైల్వేగేటు వద్ద అండర్ బైపాస్‌ను త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. హోలీక్రాస్ జంక్షన్ వద్ద జాతీయ రహదారి వద్ద ప్రమాదాలు జరగకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. రైల్వేస్టేషన్ తూర్పువైపున ప్రస్తుతం ఉన్న అదనపు టికెట్ బుకింగ్ కౌంటర్ తక్షణమే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన దబ్బల శ్రీమంత్‌రెడ్డి మాట్లాడుతూ ఆర్యభట్టనగర్‌లో రోడ్లు, డ్రైన్లు వేసేందుకు కొద్ది సమయం పడుతుందని, పారిశుధ్యం, వీధిదీపాలను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. రైల్వేగేటు వద్ద అండర్ బైపాస్‌తో పాటు అదనపు టికెట్ కౌంటర్‌ను ప్రారంభించేందుకు తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తితో మాట్లాడతామని చెప్పారు.

## వైసీపీ పీడ విరగడై సుపరిపాలన మొదలై ఏడాది



గూడూరు, జూన్ 4ప్రభాతవార్త : వైసీపీ పీడ విరగడై ఎన్డీఏ కూటమి పరిపాలన మొదలైన ఏడాదిలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని జనసేన పార్టీ లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి, ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు తెలిపారు. జనసేన పార్టీ అధినేత డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు అరాచక పాలన అంతమై, సుపరిపాలన మొదలై ఏడాది అయిన సందర్భంగా గూడూరు నియోజకవర్గంలో కొండాగుంట గ్రామంలో జనసేన గూడూరు మండల అధ్యక్షులు పాలిచెర్ల భాస్కర్ ఆధ్వర్యంలో కోట మండలం కేశవరంలో వెంకయ్య, కోటయ్య, గురు ఆధ్వర్యంలో వాకాడు మండలం అధ్యక్షులు రౌతు శివకుమార్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో సంక్రాంతినీ మరపించేలా మహిళలు రంగవల్లులు తీర్చిదిద్దారు. అనంతరం గూడూరు నియోజకవర్గ పిఏసి మోహన్ మాట్లాడుతూ ఆర్థికంగా నలిగిపోయిన రాష్ట్రాన్ని కుటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఏడాదిలో ముఖ్యంగా పంచాయతీల్లో అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు విజయ్, సాయికిరణ్,మనోజ్, సుమన్, ముత్యాలు, మస్తాన్, వంశీ, సనత్, రవి, గురప్ప, జైపాల్, చంద్రయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఇచ్చిన హామీలు ఏవి నెరవేర్చలేదు : ఎమ్మెల్సీ



గూడూరు, జూన్ 4 ప్రభాతవార్త : కూటమి ప్రభుత్వం వచ్చి సంవత్సరం గడిచిన ఇచ్చిన హామీలు ఏవి నెరవేర్చలేదని ఎమ్మెల్సీ మేరీగా మురళి వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న వెన్నుపోటు దినోత్సవంలో భాగంగా గూడూరు పట్టణంలోని టవర్ క్లాక్ సెంటర్ నుండి సబ్ కలెక్టర్ కార్యాలయం వరకు వైసిపి ఎమ్మెల్సీ మేరీగా మురళి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ప్రదర్శనగా వెళ్లి సబ్ కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతి పత్రం అందజేసారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్సీ మేరీగా మురళి మాట్లాడుతూ ప్రజలు ఎంతో నమ్మకంతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించాలని అయితే సంవత్సరం అవుతున్న ఇప్పటివరకు ఏ పథకాలు అమలు చేయడం లేదని టిడిపి పార్టీని నమ్మి మోసపోయామని ప్రజలు ఆవేదన చెందుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భక్తవత్సలరెడ్డి, బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులు, సునీల్ రెడ్డి, గురవయ్య, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గత ప్రభుత్వంలో ప్రజలు భయాందోళనలో జీవించారు

**- ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్**



గూడూరు, జూన్ 4 ప్రభాతవార్త : గత వైసిపి ప్రభుత్వంలో ప్రజలు తీవ్ర భయాందోళనలో జీవనం సాగించారని వైసిపి నాయకులు నేడు వెన్నుపోటు దినం నిర్వహించడం హాస్యాస్పదంగా ఉందని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పేర్కొన్నారు. గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడూతూ కూటమి ప్రభుత్వం వచ్చి నేటితో సంవత్సరం అయిందని కూటమి ప్రభుత్వంపై ప్రజల ఆదరణ చూసి భయపడి వైసిపి నాయకులు వెన్నుపోటు దినం కార్యక్రమం చేశారని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వంలో మెగా డీఎస్సి వేస్తామని హామీ ఇచ్చారు. ఏమీ చేసారో గుర్తు చేసుకోవాలని కోరారు. పేదవాడి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్లను మూసివేసారని ఎస్సీ, ఎస్టీ, బీసీ కార్పొరేషన్లను నుండి ఒక్కరికైనా ఏ సహాయమైనా జరిగిందా అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో నాయకులు కిరణ్ కుమార్, భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర రాజు, ఇజ్రాయిల్ కుమార్, రవీందర్ రెడ్డి, శ్రీనివాసులు, చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

## పశువుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త పాటించాలి



వెంకటగిరి, జూన్ 4 ప్రభాతవార్త : పశువుల ఆరోగ్యం పట్ల యజమానులు తగు శ్రద్ధ చూపాలని శ్రీ వెంకటేశ్వర పశు విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ సురేష్ బాబు సూచించారు. కృషి విజ్ఞాన కేంద్రం, పెరియవరం, వెంకటగిరి శాస్త్రవేత్తలు మండలంలోని ధర్మాపురం, గుండ్ల సముద్రం గ్రామాల్లో రైతుల కొరకు వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం నుండి ప్రొఫెసర్ డా. సురేష్ బాబు పాడి పెంపకంలో అధిక పాల దిగుబడి కొరకు సూపర్ నేపియర్ పశు గ్రాసం అనువైనదని తెలిపారు. అలాగే పశువులకు రోజు ఇచ్చే దానాలో రైతులు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కే.వి.కే, శాస్త్రవేత్తలు శ్రీనివాసరెడ్డి, నాగార్జునరెడ్డి, విజయశ్రీ, ఐఆర్ఆర్ శాస్త్రవేత్తలు అనంత, బండెప్ప, మంగళదీప్, రైతులు పాల్గొన్నారు.

## కాకాణి మూలాఖత్‌లో ఎంపీలు గురుమూర్తి,మిథున్ రెడ్డి



వెంకటగిరి, జూన్ 4 ప్రభాతవార్త : అక్రమ మైనింగ్ కేసులో నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డిని రాజంపేట, తిరుపతి ఎంపీలు పెద్దిరెడ్డి మిథునరెడ్డి, డాక్టర్ మద్దిల గురుమూర్తిలు ములఖత్ అయ్యారు. కాకాణిని వారు కలిసి పొలాంశాలపై చర్చించారు. వైసిపి వారిని కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపిస్తున్నారని ఎంపీలు అన్నారు. కూటమి ప్రభుత్వ అక్రమాలను ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెడుతున్నట్లు తెలిపారు. ప్రజలే ప్రభుత్వానికి తగులపాఠం చెప్తారు అన్నారు.

## మండల పరిషత్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు : ఎంపిడిఓ



వాకాడు, జూన్ 4 ప్రభాతవార్త : మండల పరిషత్ కార్యాలయంలో కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం తాగునీరు వీధి దీపములో, ఏ ఇతర కారణాలు వలన సమస్యలను తెలియజేయుటకు మండల కార్యాలయంలో 9505234689 నెంబర్‌కు కాల్ చేస్తే వెంటనే పరిష్కారం చేసే విధంగా చర్యలు చేపడతానని గౌరవ మండల పరిషత్ అభివృద్ధి అధికారి వారు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎంపీడీవో



వాకాడు, జూన్ 4 ప్రభాతవార్త : కొండాపురం సచివాలయాన్ని బుధవారం మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు తనిఖీ చేశారు. సచివాలయంలో ఏపీ ఫైబర్ నెట్ అనేది రావడం లేదు అని ఎంపీడీవోకి ఫిర్యాదు రావడంతో కొండాపురం సచివాలయానికి వెళ్లి అక్కడ ఉండేటటువంటి పంచాయతీ కార్యదర్శితో వేరొక నెట్ పెట్టుకొని ఈ పేమెంట్స్‌ని త్వరితగతిన పూర్తి చేయవలసిందిగా తెలిపారు. పర్యావరణం దినోత్సవం సందర్భంగా మొక్కలను నాటాలని పంచాయతీ కార్యదర్శి వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు సంబంధిత పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## వెన్నుపోటు కార్యక్రమంలో వైసీపీ నేతలు



చిట్టమూరు, జూన్ 4 ప్రభాతవార్త : వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన వెన్నుపోటు దినోత్సవం లో భాగంగా చిట్టమూరు మండలం నుండి భారీగా తరలి వెళ్లారు. మండల వైసీపీ కన్వీనర్ సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని నాయకులు కార్యకర్తలు గూడూరులో బుధవారం జరిగిన వెన్నుపోటు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు. గూడూరు వైసీపీ అభ్యర్థి, ఎమ్మెల్సీ మేరీగా మురళీధర్ ఆధ్వర్యంలో జరిగిన వెన్నుపోటు కార్యక్రమంలో చిట్టమూరు మండల నేతలు సన్నారెడ్డి శ్రీనివాసులురెడ్డి, కామిరెడ్డి కస్తూరిరెడ్డి, పేట రాజారామిరెడ్డి, గొట్టిపాటి రవీందర్‌రెడ్డి, బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, మండల వైసీపీ యువత అధ్యక్షులు మాచిరెడ్డి సుధీర్‌రెడ్డి, అనిల్ రెడ్డి, లోకేష్‌రెడ్డితో పాటు చెంచు పుట్ట బాబు, కృష్ణమోహన్‌రెడ్డి, అశ్వినరెడ్డి, జడ్పీటీసీ చిప్పల వెంకటయ్య, పకీరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎండిఎం ఏజెన్సీలకు శిక్షణ కార్యక్రమం

పెళ్లకూరు జూన్4ప్రభాతవార్త : మండల కేంద్రమైన పెళ్ళకూరులో ప్రభుత్వ ఉన్నత పాఠశాల నందు మండల విద్యాశాఖ అధికారి మించల శంకరయ్య గారి ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజన పథకంలో పనిచేస్తున్న వంటలక్కలకు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఆర్పిగా శిక్షణ ఇస్తున్న ప్రాజెక్ట్ అసిస్టెంట్ రోజా గారు పాఠశాల విద్యార్థులకు నాణ్యమైనన్యూట్రిషన్ ఫుడ్ ఎలా తయారు చేసి అందించాలో వంటల అక్కలకు క్షుణ్ణంగా వివరించడమే కాకుండా డిజిటలైజేషన్ చిత్రాల ద్వారా అర్థమయ్యేలా వివరించారు.

## కూటమి పాలనపై ఏడాదిలోనే ప్రజా వ్యతిరేకత



కోట, జూన్ 4 ప్రభాతవార్త : ఏడాది కూటమి పాలనపై ప్రజా వ్యతిరేకత స్పష్టంగా కనిపిస్తోందని కోట మండల వైసీపీ కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్‌రెడ్డి, సిద్దవరం సొసైటీ మాజీ ఛైర్మన్ సన్నారెడ్డి చెంచురాఘవరెడ్డి, వైసీపీ రాష్ట్ర పంచాయతీరాజ్ ప్రధాన కార్యదర్శి పాదర్తి రాధాకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం గూడూరుకు ర్యాలీగా వెళుతూ వారు కోటలో విలేఖరులతో మాట్లాడారు. అధికారంలోకి రాకముందు కూటమి నాయకులు చెప్పిన సూపర్ సిక్స్‌లు సక్రమంగా అమలు చేయలేదన్నారు. అదే తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైసీపీ పాలనలో కరోనా వంటి సంక్షోభం ఎదురైనా చెప్పిన మాట ప్రకారం మడమతిప్పకుండా సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. ఏడాది పాలనలో ప్రతి గ్రామానికి వెళ్లి ఫలానా పనిచేశామని చెప్పే ధైర్యం దమ్ము కూటమి నాయకులకు లేదన్నారు. ఈ సమావేశంలో పుచ్చలపల్లి జలసంఘం మాజీ అధ్యక్షుడు దువ్వూరు వెంకటరమణారెడ్డి, మండల వైసీపీ ఆర్గనైజర్ పాముల సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

## వెన్నుపోటు పొడవడం చంద్రబాబు నైజం : కిలివేటి



నాయుడుపేట, జూన్ 4 ప్రభాతవార్త : రాష్ట్రంలో ఎవరికైన వెన్నుపోటు పొడవడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నైజమని సూళ్ళూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆరోపించారు. వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ బుధవారం నిర్వహించిన వెన్నుపోటు దినం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా మాజీఎమ్మెల్యే మాట్లడుతూ గతంలో వైస్రాయ్ హోటల్‌లో అప్పటి ముఖ్యమంత్రి ఎన్‌టి రామారావును వెన్నుపోటు పొడిచి అధికారంలోనికి వచ్చిన చంద్రబాబునాయుడు 2024 సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామిలను నెరవేర్చకుండా రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పోడుస్తున్నాడని ఆయన ఆరోపించారు. సూపర్‌సిక్స్ హామిల్లో ఫించన్లు పంపిణీ తప్ప ఏఒక్క హామి నెరవేర్చలేదని విమర్శించారు.ప్రజా వ్యతిరేఖ పాలనపై గళం ఎత్తిన ఉమ్మడి నెల్లూరుజిల్లా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కాకాణి గోవర్దన్‌రెడ్డిని అక్రమ కేసుల్లో ఇరికించి అరెస్టు చేశారని తెలిపారు. అనంతరం అనంతరం అంబేద్కర్ విగ్రహం నుండి వైసిపి నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా తహశీల్దార్ కార్యాలయం వరకు చేరుకొని సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలంటూ తహసిల్దార్ రాజేంద్రకు విన్నతిపత్రం అందజేశారు. ఈకార్యక్రమంలో వైసిపి రాష్ట్రకార్యధర్శి కామిరెడ్డి సత్య నారాయణరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు తంబిరెడ్డి సుబ్రమణ్యంరెడ్డి,వైసిపి జిల్లా కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి,వైసిపి నాయుడుపేట పట్టణ అధ్యక్షుడు కలికి మాధవరెడ్డిమండలపార్టీ అధ్యక్షుడు ఒట్టూరు కిషోర్‌యాదవ్,మున్సిపాల్టి చేర్మేన్ కటకం దీపిక, నాయుడుపేట ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి,తదితర పాల్గొన్నారు.

## వెన్నుపోటు దినం నాడు సీఎంపై మండిపాటు



పెళ్లకూరు జూన్ 4 ప్రభాతవార్త :మాజీ ముఖ్యమంత్రివర్యులు వైయస్ జగన్మోహన్‌రెడ్డి ఆదేశానుసారం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించుతున్న వెన్నుపోటు కార్యక్రమంను సూళ్లూరుపేట నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య ఆధ్వర్యంలో నాయుడుపేట పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్ వద్ద నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటగా వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి తర్వాత అంబేద్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో అన్ని మోసపూరితమైన హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసందన్నారు. ఈ కార్యక్రమంలో పెళ్లకూరు మండలం నుంచి ఎంపీపీ శేఖర్‌రెడ్డి పెళ్లకూరు మండల జడ్పిటిసి ప్రిస్కిల్లా పెళ్లకూరు మండల కార్యకర్తలు పాల్గొన్నారు.

## అధికారం కోసం సూపర్ సిక్స్: ఏడాదైనా ఆర్థిక గోల

**వెన్నుపోటు దినంలో మాజీ ఎంఎల్ఏ**




శ్రీకాళహస్తి,జూన్ 4 ప్రభాతవార్త : అధికారం కోసం ఎన్నికల ముందు సూపర్ సిక్స్ అంటూ జనాన్ని నమ్మించిన చంద్రబాబునాయుడు అధికార పీఠమెక్కిన తరువాత ఆర్థిక సంక్షోభం అంటూ మొసలి కన్నీరు కారుస్తూ ప్రజల్ని మోసం చేస్తున్నారని మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం వారి సహచరులు ధ్వజమెత్తారు. పార్టీ అధిష్టానం పిలుపు మేరకు బుధవారం 'వైకాపా సారధ్యంలో వెన్నుపోటు దినం'ను పాటించారు. పార్టీ కార్యాలయంలో భారీ ఎత్తున కార్యకర్తల సమావేశం నిర్వహించారు. తరువాత ఆర్‌డిఓ కార్యాలయానికి వెళ్ళి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ర్యాలి నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాది క్రితం ఎన్నికల్లో అధికారం చేజిక్కించు కొనుటకు చంద్రబాబు నాయుడు మోసపూరిత మెనిఫెస్టోను రూపొం దించి అమలు చేసారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది అయినా సూపర్ సిక్స్‌ను అమలు చేయక అప్పులు తిప్పలు,ఆర్థిక సంక్షోభం అంటూ బీద ఏడుపులతో జనాన్ని మోసం చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి మాజీ అధ్యక్షుడు అంజూరు తారక శ్రీనివాసులు వయ్యాల కృష్ణారెడ్డి, ఒడూరు గిరిధర్‌రెడ్డి, బర్రి సుదర్శన్‌రెడ్డి, గున్నేరికిషోర్‌రెడ్డి, కూనాటి రమణయ్య యాదవ్, గంగాగారి రమేష్, చెవిరెడ్డి మధుసూదనరెడ్డి,హరి ప్రసాద్‌రెడ్డి, పగడాల రాజు, ప్రభాకర్ వైయస్ఆర్ పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కన్నుల పండువగా బంగారమ్మ జాతర



తొట్టంబేడు,జూన్ 4 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పొలిమేరల్లో వెలసిన బంగారమ్మ ఆలయంలో జాతర సంబరాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శ్రీకాళహస్తీశ్వ రాయం జాతరను రెండు రోజుల పాటు నిర్వహించుటకు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేసారు. బుధవారం ఆలయానికి పూల ముస్తాబులతో కన్నులుమిరుమిట్లు గొల్పు విద్యుత్ దీపాలంకరణలతో తీర్చి దిద్దారు. బంగారమ్మ ఆలయానికి శ్రీకాళహస్తిలోని ఎన్‌టిఆర్‌నగర్, ఎల్‌ఐసి కాలనీ,రామచంద్రాపురం, కైలాసగిరికాలనీ, రాజీవ్‌నగర్ వాసులు విశేష సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కాగా సాయంత్రం బంగారమ్మ ఉత్సవ విగ్రహాన్ని గ్రామోత్సవం నిర్వహించారు. చక్కగా సప్పరాన్నిముస్తాబు చేసారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని అలంకరించి ఊరేగింపును నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్టు దర్శనంతో పాటు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందించారు. అమ్మవారిని దర్శించుకున్న వారిలో బిజెపి రాష్ట్రకార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, తెలుగుదేశం యువ నాయకుడుఎస్‌సివి దిలిప్ ఉన్నారు. వారికి అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందించారు.

# వెన్నుపోటు... గొడ్డలిపోటుకు పేటెంట్ జగన్‌రెడ్డిదే!

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, జూన్ 4 ప్రభాతవార్త : దేశంలోనే వెన్నుపోటు... గొడ్డలిపోటుకు పేటెంట్ హక్కులు కలిగి వున్న ఏకైక వ్యక్తి వైసిపి అధినేత వై.ఎస్.జగన్మోహనరెడ్డి అని నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ విమర్శించారు. బిసి సామాజిక వర్గానికి చెందిన జింకా వెంకటనరసయ్య తన బెరైటీస్ గనుల్లో జగన్ తాత రాజారెడ్డికి పోనీలే అని భాగస్వామ్యం ఇస్తే, గనుల యజమానిని హత్య చేసి ఆ మైన్‌ను కబ్జా చేశాడని ఆరోపించారు. బిసిలకు వెన్నుపోటుతోనే జగన్ కుటుంబం ఆర్థిక, రాజకీయ చరిత్ర ప్రారంభమైందన్నారు. కాంగ్రెస్ పార్టీని అడ్డుపెట్టుకుని లక్షల కోట్లు దోచుకుని అదే పార్టీకి వెన్నుపోటు పొడిచి వైసిపిని స్థాపించారని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివకుమార్ అనే వ్యక్తి స్థాపించిన వైకాపాను కబ్జా చేసి శివకుమార్‌కు, ఎత్తుకుని పెంచిన బాబాయ్‌ని గొడ్డలిపోటుతో చంపి రక్తసంబంధానికి వెన్నుపోటు పొడిచిన ఘనత ఈ దేశంలో జగన్‌కు తప్ప మరెవరికీ దక్కదని పేర్కొన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా తొలి ఏడాదిలో 70 శాతం హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చిందని, గత అయిదేళ్లలో 85 శాతం హామీలకు జగన్ ఎగనామం పెట్టాడని తెలిపారు. పేదల కోసం 203 అన్నా క్యాంటీన్లు ప్రారంభించామని, చెత్త పన్ను రద్దు చేశామని, ధాన్యం రైతులకు వైసిపి ప్రభుత్వం బకాయి పెట్టిన రూ. 1674 కోట్లు విడుదల చేశామని, పవర్ లూమ్స్‌కు 500 యూనిట్లు, హ్యాండ్ లూమ్స్‌కు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా అందిస్తున్నామని వివరించారు. మద్యపాన నిషేధంపై మాట తప్పి విషపూరిత మద్యంతో పేదల ఆరోగ్యానికి జగన్ రెడ్డి వెన్నుపోటు పొడిచారని ఆవేదన వ్యక్తం చేశారు. మెగా డీఎస్సీపై మడమ తిప్పి యువతకు వెన్నుపోటు పొడిచారని తెలిపారు. ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చామని తెలిపారు. దీపం పథకం కింద ఏడాదికి మూడు వంట గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామన్నారు. అధికారంలోకి రాగానే మొదటి నెలలోనే రూ. 4000 పెన్షన్ పెంచి అందిస్తున్నామన్నారు. రూ. 1200 కోట్లతో 20 వేల కిలోమీటర్ల మేరకు రోడ్లను బాగు చేశామని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబునాయుడు నేతృత్వంలో సంక్షేమం- అభివృద్ధితో సమపాలన జరుగుతోందని, అసలైన వెన్నుపోటు దారుడైన జగన్ రెడ్డి దొంగే...దొంగా, దొంగా అని అరిచినట్టుగా ధర్నాలు చేస్తున్నారని, ప్రజలు జగన్ ముఠా దుష్ప్రచారాలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు.

## వైకాపాచే వెన్నుపోటు దినం ర్యాలీ

బంగారుపాళ్యం, జూన్ 4 ప్రభాతవార్త: మండల కేంద్రం బంగారుపాళ్యంలో బుధవారం వైఎస్ఆర్‌సిసి నాయకులు, కార్యకర్తలు వెన్నుపోటు దినం ర్యాలీని విజయవంతంగా చేపట్టారు. ఈ ర్యాలీని పోలీసులు అడ్డుకోవడానికి ప్రయత్నించినా పోలీసులను విబేధించి ర్యాలీని కొనసాగించారు. ర్యాలీ చేపట్టడానికి ఎలాంటి అనుమతులు లేవని పోలీసులు హెచ్చరికలు చేసినా నాయకులు ఏ మాత్రం పట్టించుకోకుండా భారీ జన సమీకరణతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ సునీల్‌కుమార్, లలితకుమారిలు నివాళులు అర్పించి ర్యాలీ ప్రారంభించారు. ఆ సమయంలో ర్యాలీ చేయడానికి అనుమతి లేదని స్థానిక ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు వారిని అడ్డగించారు. కొంతసేపు పోలీసులు, వైకాపా నాయకుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. గేట్లు తోసుకొని తహసిల్దారు కార్యాలయంలోకి వెళ్లి వైఎస్ఆర్‌సిపి పార్టీ ఆదేశాల మేరకు చేపట్టిన వెన్నుపోటు దినం ర్యాలీకి సంబంధించిన వినతిపత్రంను తహసిల్దారు రాజేంద్రప్రసాద్‌కు అంద జేశారు. కార్యక్రమంలో మాజీ జడ్పీ ఛైర్మన్ కుమార్‌రాజా, వైకాపా మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఎంపిపి అమరావతమ్మ, వైస్ ఎంపిపి శిరీష్‌రెడ్డి, జడ్పీటీసీ సోమశేఖర్, పలువురు వైకాపా నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపిటిసీలు పాల్గొన్నారు.

## టిడిపి నాయకులచే విజయోత్సవ ర్యాలీ

బంగారుపాళ్యం, జూన్ 4 ప్రభాతవార్త: గత ఏడాది ఎన్నికల ఫలితాల్లో ఘన విజయం సాధించిన కూటమి ప్రభుత్వం విజయంను పురస్కరించుకుని బుధవారం బంగారుపాళ్యంలో తెలుగుదేశం నాయకులు విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పించి విజయోత్సవ ర్యాలీని ఉద్దేశించి మాట్లాడారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వైకాపా నాయకులు వెన్నుపోటు దినం చేపట్టడం విడ్డూరంగా వుందని ఎద్దేవా చేశారు











